
సాక్షి జగిత్యాల
శుక్రవారం। 19। జనవరి। 2024



వరదకాలువకు నీటి నిలిపివేత

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. కాకతీయ కాలువకు 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



పాత బస్సుల్లో ప్రయాణమెలా?

ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను నడుపుతుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో 11 డిపోలు ఉన్నాయి. -8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/20.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురిసే అవకాశముంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

అయ్యప్ప ఆలయానికి ఎంపీ రూ.5లక్షలు విరాళం



ప్రొసీడింగ్ పత్రం అందిస్తున్న ఎంపీ అర్వింద్

కోరుట్ల: కోరుట్ల శివారులోని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో నిర్మించే బృందావన్ గార్డెన్, కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.5లక్షలు మంజూరుచేశారు. ఈ మేరకు గురువారం ప్రొసీడింగ్ పత్రాలను ఆలయ శాశ్వత అధ్యక్షుడు చిద్రాల నారాయణకు అందించారు. కార్యక్రమంలో గిన్నెల శ్రీకాంత్, తులసి కృష్ణ, కనపర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి



అల్పాహారం ప్రారంభిస్తున్న నారాయణ

సారంగాపూర్: విద్యార్థులు ఇష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్ నోడల్ అధికారి బి.నారాయణ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు సాయంత్రం అదనపు తరగతుల్లో చదువుకుంటున్నారు. వారికి నారాయణ అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యాపకులు మెరుగైన బోధన అందించాలని, విద్యార్థులు ఇష్టపడి చదవాలని సూచించారు. మండలంలోని కోనాపూర్‌కు చెందిన మర్యాల రాజన్న ఐదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం అందిస్తున్నారు. ఆయనను విద్యార్థులు, అధ్యాపకులు సన్మానించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొంక వేణు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీబీని సకాలంలో గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

మల్యాల: టీబీ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించాలని, క్రమం తప్పకుండా మందులు వాడాలని టీబీ నియంత్రణ అధికారి శ్రీనివాస్ అన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొల్లపల్లెలో టీబీ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, దగ్గుతో బాధపడేవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేసుకోవాలని, వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు పోషకాహారం తీసుకునేలా ప్రభుత్వం ప్రతినెలా రూ.500 చొప్పున అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, ఏఎన్‌ఎం శైలజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న వెండి లాకర్‌కు తరలింపు



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకలను అధికారులు గురువారం బ్యాంకులో డిపాజిట్ చేశారు. భక్తులు సమర్పించిన 400కిలోల వెండిని కొద్దిరోజుల క్రితం ఆలయ అధికారులు హైదరాబాద్‌లోని మింటుకు తరలించారు. తరలించిన వెండిని కరిగించి 31 బార్లుగా తయారు చేసి జగిత్యాలలోని యూనియన్ బ్యాంక్ లాకర్లలో జమచేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీనివాసశర్మ, సునీల్ పాల్గొన్నారు.

నేడు భూనిర్వాసితులతో ఆర్డీవో సమావేశం

మల్యాల: జగిత్యాల-కరీంనగర్ నాలుగు లేన్ల జాతీయ రహదారి-563 విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో జగిత్యాల ఆర్డీవో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి భూములు కోల్పోతున్న ముత్యంపేట, నూకపల్లి, పోతారం, రాజారం గ్రామాల రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని తహసీల్దార్ మునీందర్ తెలిపారు.

గోదావరిలో కలుషితాలు

- ధర్మపురి వద్ద తగ్గుముఖం పట్టిన గంగమ్మ
- దుర్వాసన వెదజల్లుతున్న నీరు
- పనిచేయని షవర్లు
- స్నానం చేయలేకపోతున్న భక్తులు
- పరిశుభ్రత పట్టని అధికారులు

ధర్మపురి: ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో ఎప్పుడూ నిండుకుండలా ఉండే గోదావరి నది ధర్మపురి వద్ద రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. దీంతో నీటిలో కలిసిపోయిన వ్యర్థాలు బయటపడుతున్నాయి. ఈగలు, దోమలతో దుర్గంధంగా మారి పరిసరాలన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి.

స్నానాలు చేయలేకపోతున్న భక్తులు..

ధర్మపురి ప్రాచీన పుణ్యక్షేత్రం. ఇక్కడ లక్ష్మీనృసింహస్వాములతోపాటు పవిత్ర గోదావరి ఉంది. ఇక్కడి గోదావరి దక్షిణముఖంగా ప్రవహిస్తుండడం దక్షిణకాశీగానూ పిలుస్తుంటారు. ఇక్కడ స్నానాలు చేస్తే కాశీలో చేసినంత పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే నిత్యం ఈ పుణ్యక్షేత్రానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. వీరంతా ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించడం ఆనవాయితీ. ఇంతటి చరిత్ర కలిగిన పుణ్య గోదావరి పరిశుభ్రతపై నిర్లక్ష్యంపు నీడలు అలుముకున్నాయి.

స్నానాల కోసం సమీప ప్రాంతాలకు

ధర్మపురిలో స్నానం చేయడానికై వచ్చిన భక్తులంతా ఈ దుర్గంధం భరించలేక రాయపట్నం, రాజారం, దమ్మన్నపేట గ్రామాలకు తరలి వెళ్తున్నారు. పుష్కరఘాట్ల వద్ద కలుషితం పేరుకుపోవడంతో నడవలేని పరిస్థితులున్నాయి. పుణ్య స్నానాలు ఏమోగానీ అపరిశుభ్రతతో రోగాలు కొనే పరిస్థితులున్నాయి. అధికారులు స్పందించి గోదావరిలోని మురుగును తొలగించి మొరం పోసి శుభ్రం చేస్తేగానీ ఈ సమస్య తీరదని అంటున్నారు.



భక్తుల పుణ్యస్నానాలకు పేరుగాంచిన గోదావరి నది ధర్మపురి వద్ద అపరిశుభ్రంగా మారింది. ఎటుచూసినా చెత్తాచెదారం నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పవిత్ర స్నానాలు చేద్దామని ఇక్కడికి వస్తున్న భక్తులు.. చెత్తాచెదారం.. అపరిశుభ్ర వాతావరణాన్ని చూసి నీటిలో దిగకుండానే వెనుదిరుగుతున్నారు. స్నానాల సంగతి దేవుడెరుగు.. కనీసం తలపై నీళ్లు చల్లుకునేందుకూ ఇష్టపడడం లేదంటే అక్కడి వాతావరణం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పుష్కరఘాట్ల వద్ద దుర్గంధం



గతంలో పుష్కరాల సందర్భంగా గోదావరి ఒడ్డున సంతోషిమాత, మంగలిగడ్డ, సోమవిహార్ పేర్లతో ఘాట్లను ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద పుష్కరఘాట్లను ఆనుకుని పారుతుంది. అప్పుడు వేలాది మంది ఘాట్ల వద్దనే స్నానాలు చేసేవారు. వేసవి ప్రారంభం కాగానే.. ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ తగ్గుముఖం పడుతుండడంతో ధర్మపురి వద్ద నీటి ప్రవాహం కూడా తగ్గుతుంది. ఈ క్రమంలో నీటి నిల్వలున్న చోట వ్యర్థ పదార్థాలు, వస్తువులతో దుర్గంధం వెదజల్లుతోంది. భక్తులు స్నానం చేయాలంటేనే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

నిరుపయోగంగా షవర్లు

పుష్కరఘాట్ల వద్ద ఏర్పాటు చేసిన షవర్లు నిరుపయోగంగా మారాయి. దుర్గంధం మధ్యనుంచి వెళ్లలేనివారు, వృద్ధులు షవర్ల వద్దనే స్నానాలు చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అధికారులు స్పందించి షవర్లను వినియోగంలోకి తేవాలని భక్తులు కోరుతున్నారు.



స్నానానికి ఇబ్బంది



మాది నిజామాబాద్. ఎప్పటిలాగే గోదావరిలో స్నానం చేద్దామని ధర్మపురికి వచ్చాం. దుర్గంధం వెదజల్లుతోంది. నీరుమొత్తం మురికికూపంలా ఉంది. స్నానం చేయడానికి తీవ్ర ఇబ్బంది పడ్డాం. దుర్గంధాన్ని తొలగిస్తేనే భక్తులు తరలివస్తారు.
– స్వప్న, భక్తురాలు, నిజామాబాద్

పరిశుభ్రత కాపాడాలి



గోదావరిలో పరిశుభ్రత కాపాడాలి. భక్తుల మనోభావాలు దెబ్బతింటాయి. కాలినడకన గోదావరిలోకి వెళ్లలేకపోతున్నాం. నీరు మొత్తం కలుషితం అయ్యింది. దుర్వాసన వస్తోంది. స్నానం చేయకుండా స్వామివారి వద్దకు వెళ్లలేం కదా..
– సారక్క, భక్తురాలు, జగిత్యాల

చర్యలు తీసుకుంటాం



గోదావరిలో నీటిమట్టం తగ్గింది. దీంతో చెత్తాచెదారం పోరుకుపోయింది. వ్యర్థాలతో దుర్వాసన వస్తున్న మాట నిజమే. భక్తుల సౌకర్యార్థం దుర్గంధాన్ని తొలగిస్తాం. పరిసరాలల్లో పరిశుభ్రత కోసం చర్యలు చేపడుతాం.
– రమేశ్, మున్సిపల్ కమిషనర్

అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

జగిత్యాల: జిల్లాలో నమోదవుతున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మీటింగ్‌లో మాట్లాడారు. కేసుల నమోదు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అడ్లూరి మాట్లాడుతూ అట్రాసిటీ కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల భూములను ఇతర కులాల వారు కబ్జా చేయకుండా చూడాలని కోరారు. పౌరహక్కుల దినోత్సవంలో ఆర్డీవో, తహసీల్దార్, ఎస్సైలు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్, కల్వకుంట్ల సంజయ్, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవోలు నర్సింహమూర్తి, మధు, డీఎస్పీ వెంకటస్వామి పాల్గొన్నారు.

తెలంగాణ జాతిపిత కొండలక్ష్మణ్ బాపూజీ



రాయికల్: తెలంగాణ జాతిపిత కొండ లక్ష్మణ్‌బాపూజీ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఇటిక్యాలలో పద్మశాలీ సేవ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కుల సాధనకు పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సర్పంచ్ సామల్ల లావణ్య, ఎంపీటీసీ రాధ ఆదిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మహిపతిరెడ్డి, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, బైరి గంగాధర్, రాష్ట్ర కార్యదర్శి సురేశ్, నాయకులు సామల్ల మహేశ్, అంజయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గ్రామాలవారీగా సమస్యలు తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటిపై ఆధారపడకుండా అందుబాటులో ఉన్న నీటివనరులపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పైపులైన్లు, ట్యాంకులకు మరమ్మతు చేపట్టాలన్నారు. మండలంలోని మంచినీటి పథకాల మరమ్మతుకు రూ.78లక్షలు అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలపగా మంజూరుకు కృషిచేస్తానన్నారు. 24 గంటల కరెంట్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు నష్టపోయిన 24 మంది బాధితులకు రూ.3,200 చొప్పున చెక్కులు అందించారు. ఎంపీపీ శోభ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మురళీ, తహసీల్దార్ ఎంఏ.ఫరూక్, ఎంపీడీవో పులయ్య, ఎంపీవో మహేందర్, ఎంఈవో శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, వైద్యాధికారి నరేశ్, ఏపీఎం సమత పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

లోక కల్యాణం కోసమే వరద వేద పరిపాలన

ధర్మపురి: లోక కల్యాణం కోసమే ప్రేమిక వరద వేద పరిపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోని శేషప్ప కళావేదిక వద్ద నిర్వహిస్తున్న ప్రేమిక వరద పరిపాలన సభను గురువారం ప్రారంభించారు. ధర్మపురి పీఠాధిపతులు సచ్చితానంద సరస్వతీ ఆశీస్సులతో 21 మంది వేదపండితులు గణపతిపూజ, పుణ్యహావచనం, అంకురార్పణ పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎస్ దినేష్ తదితరులున్నారు.

ఓటు హక్కుపై ప్రచారం చేయాలి

జగిత్యాల: ఓటు హక్కు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. ఈనెల 22 వరకు ఓటరుగా నమోదు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఓటు వివరాలు బూత్‌స్థాయి అధికారుల వద్ద చూసుకోవాలని, పేరు లేని వారు, 18ఏళ్లు నిండిన వారు ఫాం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. చనిపోయిన వారి పేర్లు ఉంటే ఫాం-7లో పూర్తి సమాచారంతో తొలగించాలని పేర్కొన్నారు. ఫాం8 ద్వారా పేరు సరిచేయడం, ఫొటో సరిచేయడం, పోలింగ్ స్టేషన్ మారడం, అసెంబ్లీ మారేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫాం-8 ద్వారా వికలాంగుల ఓటర్లకు సంబంధించి వారి వివరాలను 80ఏళ్లు దాటి నడవలేని స్థితిలో ఉన్నవారు బీఎల్వోల ద్వారా ఫ్లాగ్ చేయాలని అవగాహన కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈనెల 22 వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని జిల్లా స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఎస్ఎస్వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించారు.

రెండోరోజూ కొనసాగిన డీఎంహెచ్‌వో తనిఖీలు

- ముందస్తుగా క్లీనిక్‌లను మూసివేసిన ఆర్‌ఎంపీలు
- గొల్లపల్లిలోని ఓ ఆర్‌ఎంపీ వద్ద కనిపించిన బెడ్లు
- తొలగించకుంటే కఠిన చర్యలు
- డీఎంహెచ్‌వో శ్రీధర్



గొల్లపల్లిలో ఆర్‌ఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

గొల్లపల్లి: జిల్లాలోని కొందరు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు వచ్చీరానీ వైద్యం చేస్తూ.. లేని రోగాలు ఉన్నట్లు చెబుతూ.. తమకు తెలిసిన ఆసుపత్రులకు పంపిస్తూ రోగులను దోచుకుంటున్నారు. దీనిపై 'వైద్యం.. వ్యాపారం' శీర్షికన బుధవారం 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందించిన వైద్య శాఖ అధికారులు అదేరోజు జిల్లాలోని గొల్లపల్లి, వెల్గటూర్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. గురువారం కూడా గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న క్లీనిక్‌లను డీఎంహెచ్‌వో శ్రీధర్ తనిఖీలు చేశారు. మండలంలోని గుంజపడుగు, రంగదాముని పల్లి, కొస్నపల్లిలో పర్యటించి పలు క్లీనిక్‌లను పరిశీలించారు. అధికారులు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పలువురు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తమ క్లీనిక్‌లను మూసివేశారు. మండల కేంద్రంలో అనుమతి లేకుండా ముందు మెడికల్ షాపు, వెనుకాల శ్రీసాయి పేరిట క్లీనిక్ నిర్వహిస్తున్న యజమాని ముస్కు స్వామిరెడ్డిపై డీఎంహెచ్‌వో శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ షాప్‌తోపాటు రెండు బెడ్లు, సెలైన్స్, ఇంజక్షన్ కనిపించడంపై మండిపడ్డారు. క్లీనిక్‌లో వెంటనే బెడ్లు తొలగించాలని, మరోసారి కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో శ్రీధర్ హెచ్చరించారు.

అదిగో చిరుత..

- చిక్కదు..దొరకదు
- జిల్లా సరిహద్దుల్లో కలకలం
- సాగు భూముల వెంట సంచారం
- కలవరపడుతున్న రైతులు



నా పేరు పాపనక రాజు..మాది అమ్మక్కపేట. నేను నాలుగు రోజుల క్రితం పొద్దున గుట్టశివారులో ఉన్న నా జొన్న చేనులో గడ్డిమందు కొడుతున్న. కొంచెం దూరంలో పొలం గట్లపై చిరుతపులి కనిపించింది. ఒక్కసారిగా భయం వేసింది. వెంటనే చుట్టుపక్కల తోటల్లో ఉన్న రైతులకు ఫోన్ చేసి చెప్పాను. వాళ్లంతా వచ్చేసరికి గుట్ట ప్రాంతంలోకి వెళ్లిపోయింది. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాం. వారు పాదముద్రలు చూసి చిరుతగా గుర్తించారు. అప్పటినుంచి భయంతో నేను జొన్న చేనుకు వెళ్లడం లేదు. ఇలా ఒకరిద్దరు కాదు..చాలామంది రైతులు చిరుతను చూసినట్లు చెబుతున్నారు. ఇదిగో చిరుత..అంటే దాంతో పాటు చిరుత పిల్ల ఉందని చెప్పుకోవడంతో పంట పొలాల్లోకి వెళ్లాలంటేనే రైతులు జంకుతున్నారు. – జగిత్యాల/కోరుట్ల



రెండు జిల్లా సరిహద్దుల్లో..

జగిత్యాలలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల్లోని ఎర్రాపూర్, రాజేశ్వర్‌రావుపేట, సత్తక్కపల్లి, అమ్మక్కపేట, గండిహన్‌మాన్, బండలింగాపూర్, మెట్లచిట్టాపూర్, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, భీంగల్, కోనసముందర్, కోనాపూర్, మానాల గ్రామాల పరిధిలో సుమారు 60 నుంచి 80 కిలోమీటర్ల మేర పశ్చిమ డివిజన్‌లోని కొంత భాగం అటవీప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో మొదటి నుంచి అటవీ జంతువుల సంచారం ఉండగా జనావాసాల్లోకి వచ్చిన సందర్భాలు చాలా తక్కువ. గుట్టబోర్ల వెంట ఉండే వాగులు, ఒర్రెలు, చెరువుల సమీపంలోని మనుబోతులు, జింకలు, కొండగొర్రెలు, ఎలుగుబంట్లు వంటి అటవీ జంతువుల సంచారం ఉంటుంది. అప్పుడప్పుడు చిరుత పులుల ఈ అటవీ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు దాఖలాలు ఉన్నాయి. ఆరేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట గుట్టబోరు శివారులో ఓ చిరుత కళేబరం దొరికింది. ఆ సమయంలో చిరుత ఎలా చనిపోయిందో అటవీ అధికారులు నిర్ధారించలేకపోయారు. ఆ తరువాత కాలంలోనూ చిరుతల సంచారం అక్కడక్కడ కనిపించింది. సాధారణంగా చిరుతలు ఉండే అటవీ ప్రాంతంలో ఒక్కరోజులో సుమారు 15 నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో సంచరించే అవకాశాలున్నాయి. అపుడప్పుడు కనిపించే చిరుతలు పక్కనే ఉన్న నిర్మల్ జిల్లా ఖానాపూర్, నిజామాబాద్ అటవీ ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లిపోతాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

తల్లీపిల్ల సంచరిస్తున్నాయా..?

ఇప్పటివరకు అమ్మక్కపేట, సత్తక్కపల్లి గ్రామాల శివారులో దొరికిన పాదముద్రలు చిరుతవేనని నిర్ధారించిన ఫారెస్టు అధికారులు.. తల్లితోపాటు పిల్ల కూడా ఉన్నట్లు గుర్తించారు. అటవీ ప్రాంతాల్లోని గుట్ట బోరుల్లోని కింది భాగాల్లోని వ్యవసాయ భూముల్లో కోతులు, పిచ్చుకలను తరిమేసేందుకు రైతులు పెడుతున్న మైక్‌లు, పెద్దగా వినవస్తున్న సౌండ్‌లకు బెదిరిపోయి చిరుత పంటపొలాల్లోకి వచ్చి ఉంటుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతులు చెప్పిన మేర పంట పొలాల పరిసరాల్లో ఇప్పటికే పూర్తిస్థాయిలో గాలించిన అటవీ అధికారులు.. ఇప్పటివరకు చిరుత ఎక్కడుందో గుర్తించలేదు. ఈ క్రమంలో రెండు గ్రామాల పరిధిలో చిరుతలను గుర్తించే ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. చిరుత కనిపించిందని చెబుతున్న పొలాల పరిసరాల్లో రైతులకు అవసరమైన జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. అయినప్పటికీ ఈ పరిసర ప్రాంతాల రైతులు పంటపొలాల్లోకి వెళ్లే సాహసం చేయడం లేదు.

బిక్కుబిక్కుమంటున్న రైతులు

రెండు గ్రామాల పరిసరాల్లో.. పలు ప్రాంతాల్లో ఇప్పటికే చిరుత సంచారం ఉండటం, కొంతమంది రైతులు ప్రత్యక్షంగా చూడటంతో రైతులు బిక్కబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. జిల్లా సరిహద్దుల్లోని గ్రామాల్లో అటవీప్రాంతాల సమీపంలో ఉన్న రైతులు తమ పంట పొలాలను వెళ్లడానికి భయపడుతున్నారు. పశువులు, ఆవులు, మేకలపై చిరుత ఇప్పటికి ఎలాంటి దాడులు చేయకపోవడంతో పెద్దగా ఇబ్బంది ఉండదని అటవీ అధికారులు చెబుతున్నా. రైతుల్లో భయం మాత్రం పోవడం లేదు. చిరుత సంచారం ప్రచారంతో వ్యవసాయ పనులకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. పగటిపూట నలుగురైదుగురు కలిసి పంట పొలాల్లోకి వెళ్లి వస్తుండగా రాత్రిపూట సాగుభూముల జోలికి వెళ్లడం లేదు. అటవీ అధికారులు మరింత పకడ్బందీగా వ్యవహరించి చిరుత ఆచూకీ కనిపెట్టి రైతుల్లో నెలకొన్న భయాందోళనలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అటవీశాఖ అధికారుల ఆరా

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేట శివారులో చిరుతపులి సంచారంపై అటవీశాఖ అధికారులు గురువారం ఆరా తీశారు. అమ్మక్కపేట, సత్తక్కపల్లి, ఎర్రాపూర్ అటవీప్రాంతంలో ఆనవాళ్లను గుర్తించేందుకు మెట్‌పల్లి రేంజ్ అధికారి మహమ్మద్ షౌకత్ ఆలీ ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు. అమ్మక్కపేట శివారులో నాలుగుచోట్ల ట్రాప్‌కెమెరాలు బిగించారు.



డిప్యూటీ రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, సురేశ్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి చైతన్యశ్రీ, బిట్ అధికారులు శివరాజ్, ఇలియాస్, రత్నాకర్ పాల్గొన్నారు.

చెరుకు తోట నుంచి వెళ్లిందట



నా చెరుకు తోట నుంచి చిరుత పులి వెళ్లిందని చుట్టుపక్కల రైతులు చూసి చెప్పారు. నేను వెళ్లి చూస్తే చిరుత పాద ముద్రలు కనిపించాయి. అప్పటినుంచి భయంతో చెరుకు తోటకే వెళ్లడం లేదు. అటవీ అధికారులు చిరుతను పట్టుకుని మాలాంటి రైతుల్లో భయం తొలగించాలి. – లవంగ నర్సయ్య, అమ్మక్కపేట

చిరుతను పట్టుకోవాలి



ఈ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్న మాట వాస్తవమే. ఎప్పుడు ఎక్కడ దాడులు చేస్తుందోనని భయపడుతున్నాం. అటవీ అధికారులు చిరుతను పట్టుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటి వరకు ఆచూకీ దొరకలేదు. చిరుతను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించాలి. – మహేశ్, సత్తక్కపల్లి

భయపడాల్సిన అవసరం లేదు

ఇప్పటివరకు చిరుత హాని తలపెట్టలేదు. ఒక్కరోజులో చిరుత 20 నుంచి 25 కిలోమీటర్ల దూరం సంచరిస్తుంది. రైతులు భయపడాల్సిన అవసరం లేదు. చిరుతను గుర్తించడానికి ట్రాప్ కెమెరాలు పెట్టాం. పాదముద్రల ఆధారంగా చిరుత ఎటు వెళ్లిందో అంచనా వేస్తున్నాం. రైతులను అప్రమత్తం చేశాం.
– షౌకత్‌అలీ, ఫారెస్ట్ రేంజర్, మెట్‌పల్లి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్: నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచి, తృతీయ స్థానంలో నిలిచింది. కోచ్, మేనేజర్‌గా రాకేశ్, మహేశ్, పోటీల పరిశీలకుడిగా కరీంనగర్ జిల్లాలోని వేగురుపల్లి జెడ్పీ హైస్కూల్ పీఈటీ ఎండీ.యూనిస్ పాషా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు బాలికల జట్టును అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్ సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో కోచ్ వినోద్

కోనరావుపేట(వేములవాడ): తమిళనాడులో ఈనెల 18 నుంచి 21 వరకు జరిగే సౌత్ జోన్ ఖేలో ఇండియా వుషూ ఉమెన్స్ లీగ్ పోటీలకు రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు కిక్‌బాక్సింగ్ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వినోద్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తమిళనాడు ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో 46 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన పసుల జెస్సికా(39 కేజీల విభాగం), నూకల సుదీప్తి(33 కేజీల విభాగం) ఎంపికైనట్లు వివరించారు. వీరిని కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఎం.ప్రియాంక, రోహిత్ అభినందించారు.

ఖాతా నుంచి డబ్బు మాయం

జ్యోతినగర్(రామగుండం): డబ్బులు రెట్టింపు వస్తాయని ఆశపడి టెలీగ్రాంలో వచ్చిన టాస్క్ మేరకు లింక్ ఓపెన్ చేసి కాంపిటీషన్‌లో పాల్గొని డబ్బు పంపితే తన ఖాతాలోని రూ.1,53,000 పోగొట్టుకున్న ఘటనపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ఆష్రఫ్ అలీకి ఈనెల 15న టెలీగ్రాంలో సందేశం వచ్చింది. లింక్ ఓపెన్ చేసి కాంపిటీషన్‌లో పాల్గొనగా డబ్బులు పోయాయని ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి



పట్టుబడిన నిందితులు

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట శివారు నిజాం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి ఐదుగురు నిందితులను పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. నిందితుల నుంచి మూడు పందెం కోళ్లు, రూ.4,500 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

పాత బస్సుల్లో ప్రయాణమెలా?

- 15 లక్షల కి.మీ. పైబడి తిరిగినవే అందుబాటులో..
- కరీంనగర్ రీజియన్‌లో 861 బస్సులు
- 186 మందే మెకానిక్‌లు
- గత నెలలో ఎల్కతుర్తిలో ఊడిన పల్లె వెలుగు బస్సు టైర్లు
- 'ఆర్టీసీ' ప్రయాణంపై ప్రజల్లో ఆందోళన

'గత డిసెంబర్ చివరి వారంలో కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి మధ్యలో ఉన్న ఎల్కతుర్తి సమీపంలో ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు టైర్లు ఊడిపోయాయి. ప్రయాణికులు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. దీనిపై టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ప్రయాణికులను గమ్యం చేర్చే విషయంలో నిర్లక్ష్యం వద్దని, ఆర్టీసీ, అద్దె బస్సులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మెకానిక్‌లతో రోజువారీగా తనిఖీలు నిర్వహించి, బస్సుల కండీషన్‌పై నిఘా పెంచాలన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో అవే పాత బస్సులు, అరకొర సిబ్బంది(మెకానిక్‌లు)తో నెట్టుకొస్తున్నారు. నిత్యం ఆర్టీసీ బస్సుల్లో తిరిగే సామాన్య ప్రజానీకం బస్సుల కండీషన్‌పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.'

కరీంనగర్: ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను నడుపుతుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో 11 డిపోలు ఉన్నాయి. కరీంనగర్–1, 2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ డిపోల్లో 524 ఆర్టీసీ, 337 అద్దె బస్సులు మొత్తంగా 861 నడుస్తున్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు బస్సులే 230. ఇన్ని వాహనాలకు కేవలం 186 మంది మెకానిక్‌లు పని చేస్తున్నారు. ఈ బస్సులు రీజియన్ పరిధిలో ప్రతీరోజు 3.50 లక్షల కిలోమీటర్లు తిరిగి, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతూ రూ.కోటి నుంచి రూ.1.20 కోట్ల వరకు ఆదాయాన్ని ఆర్టీసీకి సమకూర్చుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నాలుగేళ్లుగా కొత్త బస్సులను డిపోలకు కేటాయించలేదు. ఉన్నవి 15 లక్షల కిలోమీటర్లు పైబడి తిరిగినవే కావడంతో వాటిని నడిపేందుకు డ్రైవర్లు నిత్యం సాహసమే చేస్తున్నారని చెప్పవచ్చు. బస్సులు కండీషన్‌లో లేకపోవడం వల్ల ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడపాల్సి వస్తోందని వాపోతున్నారు. లోకల్ బస్సులతోపాటు దూరప్రాంతాలకు వెళ్లే అన్ని రకాల సర్వీసులు ప్రయాణానికి ఏ మాత్రం అనుకూలంగా లేవని, నష్టాల ఊబిలో చిక్కుకున్న ఆర్టీసీని కాపాడుకోవాలని టార్గెట్లు పెట్టడమే తప్ప తమ బాగోగులు చూడటం లేదని డ్రైవర్లు, కండక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటిలో అధికంగా సూపర్ లగ్జరీ, రాజధాని, ఎక్స్‌ప్రెస్, మినీ బస్సులు ఉన్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని, కాలం చెల్లిన బస్సులను సైతం నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని బస్సుల మరమ్మతులు, నిర్వహణపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నాలుగు బృందాలుగా మెకానిక్‌లు..

బస్సుల మరమ్మతుల కోసం మెకానిక్‌లను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేశారు. మొదటి బృందంలో ఎక్కువ మంది మెకానిక్‌లు ఉండి, ప్రతీ బస్సును నిత్యం పరిశీలిస్తారు. రెండో బృందం బస్సు ట్రిప్పునకు వెళ్లి వచ్చిన ప్రతీసారి బస్సు మొత్తం తనిఖీ చేస్తుంది. మూడో బృందం ప్రతీ బస్సును వారానికోసారి ప్రత్యేకంగా పరిశీలించి,



కరీంనగర్ బస్టాండ్‌లో బస్సులు

గ్రీజింగ్ చేసి, ఫిల్టర్లు శుభ్రం చేస్తుంది. ఇక నాలుగో బృందం నెలకోసారి బస్సుల టైర్లు, గేర్‌బాక్స్‌లను పరిశీలిస్తుంది. ఇంజిన్ ఆయిల్, ఫిల్టర్లను మార్చుతుంది. దీంతోపాటు డ్రైవర్లు సూచించిన సమస్యలను సైతం ప్రత్యేకంగా పరిష్కరిస్తుంది.

నూతన నియామకాల్లేవ్..

సాధారణంగా డిపోలో 100 బస్సులుంటే 32 మంది మెకానిక్‌లు, ఒక్కో మెకానిక్‌కు ఒక సహాయకుడు ఉండాలి. కొన్నేళ్లుగా ఆర్టీసీలో నూతన నియామకాలు చేపట్టకపోవడంతో మెకానిక్‌ల సంఖ్య తగ్గింది. అయితే, బస్సుల సంఖ్య సైతం తగ్గినందున సరిపడా మెకానిక్‌లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని డిపోల్లో సిబ్బంది తక్కువగా ఉండటంతో ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమించారు. మెకానిక్‌లకు సరిపడా సహాయకులు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అప్రెంటిస్‌లను నియమిస్తున్నా సరిపడా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు పని చేసేందుకు విముఖత చూపుతున్నారన్న చర్చ జరుగుతోంది.

నిత్యం పరిశీలించాలి..

సాధారణంగా బస్సును డిపో నుంచి బయటకు తీసే సమయంలో మెకానికల్ ఇంజినీర్ పరిశీలించి, సమస్యలు ఉంటే మెకానిక్‌లచే మరమ్మతులు చేయించాలి. టైర్లు, ఇతరత్రా ముఖ్యమైన విభాగాలను పరిశీలించి, ఊడిపోయేలా ఉన్న నట్లు, బోల్టులను బిగించి, పంపించాలి. ఇదే సమయంలో ఆరోజు విధుల్లో ఉండే డ్రైవర్ తనకు కేటాయించిన బస్సును సరిచూసుకొని, ఏమైనా సమస్యలను సూచిస్తే పరిష్కరించాలి. అనంతరం బస్సు ప్రయాణం పూర్తయిన తర్వాత డిపోలోకి వచ్చే సమయంలో డ్రైవర్లు గుర్తించిన సమస్యలను ప్రత్యేకంగా సూచిస్తారు. వీటిని రాత్రి విధుల్లో ఉండే మెకానిక్‌లు పరిష్కరిస్తారు.

ఏ డిపోలో ఎంతమంది?

గోదావరిఖనిలో 28 మంది, హుస్నాబాద్‌లో 9, హుజూరాబాద్ 17, కరీంనగర్–1 డిపోలో 26, కరీంనగర్–2 డిపోలో 22, మంథనిలో 13, జగిత్యాలలో 22, కోరుట్లలో 15, మెట్‌పల్లిలో 10, సిరిసిల్లలో 12, వేములవాడలో 12 మంది మొత్తంగా 186 మంది మెకానిక్‌లు విధులు నిర్వహిస్తున్నారు. తక్షణమే కొత్త బస్సుల కేటాయింపులతోపాటు సిబ్బందిని నియమించాలని యజమాన్యాన్ని కోరుతున్నారు.

జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో 'ఆగ్రో మెషిన్'



కొత్తపల్లి(కరీంనగర్): పుణెలోని బాలేవాడి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్టీ), స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎస్‌సీఈఆర్టీ) మహారాష్ట్ర సహకారంతో ఇటీవల జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల పదోతరగతి విద్యార్థిని శుభశ్రీ సాహు రూపొందించిన ఆగ్రో మెషిన్‌ను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహారాష్ట్ర గవర్నర్ రమేశ్ బైస్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, విద్యాశాఖ మంత్రి దీపక్ కేసర్కర్ ఈ మెషిన్ పనితీరును తెలుసుకొని, విద్యార్థినిని అభినందించారు. దేశవ్యాప్తంగా 11 పాఠశాలల ఎగ్జిబిట్స్ సైన్స్ ఫెయిర్ ఫైనల్స్‌కు ఎంపికవగా వాటిలో పారమిత ఎగ్జిబిట్ ఉండటం గర్వకారణమని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాద్ రావు అన్నారు. కె.వి.ఆర్.ఎస్.ఎస్. సొసైటీ నుంచి స్పార్క్ ఇన్నోవేషన్ అవార్డు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ఇన్‌స్పైర్ అవార్డును శుభశ్రీ అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, వినోద్ రావు, రితేశ్‌మెహతా, గోపీకృష్ణ, గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు ఆమెను అభినందించారు.

అందుబాటులో లేని ఆర్పీ

జగిత్యాల: రుణం పేరిట మోసానికి యత్నించిన విషయంలో ప్రధాన సూత్రదారి అయిన మహిళ, ఆర్పీ అందుబాటులో లేకపోవడంతో అధికారులు లోతుగా విచారిస్తున్నారు. సంబంధిత బ్యాంక్ అధికారులు మాత్రం ఈ మహిళలను తీసుకువచ్చింది ఒక ఆర్పీయేనని చెప్పడంతో ఆమె అధికారుల ముందుకు వస్తే తప్ప అసలు ఏం జరిగింది..? ఎలా లోను ఎత్తారనే విషయం తేలనుంది. ఇప్పటికే మహిళల స్టేట్‌మెంట్లను బ్యాంక్ అధికారులు రికార్డు చేస్తున్నారు. ఈ విషయంలో అదనపు కలెక్టర్, మెప్మా పీడీ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఒకవేళ నివేదిక అందిన అనంతరం అందరిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

జిల్లాలో అనేకం...

డూప్లికేట్ గ్రూపులను ఏర్పాటు చేసి అనేక మంది మహిళలు మోసపోయినట్లు తెలుస్తోంది. ఆర్థికంగా వెనుకబడి డబ్బు అవసరమున్న మహిళలను గుర్తించి వారికి లోన్లు ఇప్పిస్తామని చెబుతూ ఇలాంటి వాటిలో ఇరుక్కుపోతున్నారు. ఒక గ్రూపులో లోను ఎత్తాలంటే అనేక నిబంధనలుంటాయి. కానీ సులువుగా లోన్లు అందడంతో ఇందులో ఎవరి పాత్ర ఉందనేది అర్థం కావడం లేదు. జిల్లాలోని గాంధీనగర్, కృష్ణానగర్ కొన్ని కాలనీల్లో కొందరు మహిళలు ఈ విధంగానే మోసపోయినట్లు ఫోన్ల ద్వారా తెలుపుతున్నారు. తమకు రూ.లక్ష లోను ఇస్తామని చెప్పి వారు బ్యాంకుల ద్వారా రూ.1.80 లక్షల వరకు ఇచ్చారని, ఇప్పుడు వాటికి నోటీసులు వస్తున్నాయని పేర్కొంటున్నారు.

బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి

- కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లకు పాతోళ్లే

మంథని/కరీంనగర్ టౌన్: బీజేపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ హైకమాండ్ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాలకు ప్రస్తుతం పనిచేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి, పైడిపల్లి సత్యనారాయణ రావు, ప్రతాప రామకృష్ణలనే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా మంథనికి చెందిన చందుపట్ల సునీల్‌రెడ్డిని నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాకు గతంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ పనిచేయగా ఆయన రాజీనామాతో ఆ బాధ్యతలను రావుల రాజేందర్ చూశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.



సునీల్‌రెడ్డి

విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్

- 22 మోటార్లు, కారు స్వాధీనం

జగిత్యాలక్రైం: జగిత్యాలతోపాటు జిల్లాలోని బీర్‌పూర్, రాయికల్, మెట్‌పల్లి పరిధిలో విద్యుత్ మోటార్లను దొంగిలిస్తున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్లు చోరీకి గురవుతుండడంతో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెంచారు. ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గురువారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ కెనాల్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దానిని తనిఖీ చేయగా అందులో నాలుగు మోటార్లు పట్టుబడ్డారు. కారులో ఉన్న ఇద్దరిని నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్దూరుకు చెందిన చెన్నమనేని మహేశ్, బసగుట్ట నవీన్‌గా గుర్తించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4, రాయికల్ పరిధిలో 3, బీర్‌పూర్‌లో 4, మెట్‌పల్లిలో 4 మోటార్లు దొంగలించినట్లు నిందితులు అంగీకరించారు. వారిచ్చిన సమాచారం మేరకు మొత్తంగా 22 మోటార్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలించామని అడిషనల్ ఎస్పీ పేర్కొన్నారు. డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై సదాకర్, హెడ్‌కానిస్టేబుల్ నసీర్‌ఖాన్, కానిస్టేబుల్ శ్రీనివాస్, గంగాధర్‌ను అభినందించారు.



మోటార్లను పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

- మోపెడ్‌ను ఢీకొన్న కొరియర్ వాహనం
- చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో ఘటన



కొంరుమల్లు (ఫైల్)

చిగురుమామిడి(హుస్నాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లికి చెందిన మేడుదుల కొంరుమల్లు(62) గురువారం ఉదయం 7.30 గంటలకు తన వ్యవసాయ బావి వద్దకు మోపెడ్‌పై వెళ్లి, తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో వరంగల్ జిల్లాకు చెందిన ఫ్లిప్‌కార్ట్ కొరియర్ సర్వీసు హుస్నాబాద్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తోంది. డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం కారణంగా బొమ్మనపల్లి శివారులో కొంరుమల్లు వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని, కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా, అందరికీ వివాహాలయ్యాయి. చిగురుమామిడి ఎస్సై రాజేశ్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య కొంరవ్వ ఫిర్యాదు మేరకు కొరియర్ వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఆడుకుంటూ వెళ్లి శవమై..

- కేజీవీల్స్ కింద పడి బాలుడి దుర్మరణం
- పరారీలో ట్రాక్టర్ డ్రైవర్

సారంగాపూర్: అప్పటిదాకా తల్లిదండ్రులతో కలిసి పొలం పనుల్లో సహాయపడ్డాడు. ఆనందంగా ఇంటికి చేరాడు. ఇప్పుడే వస్తానమ్మా.. అంటూ సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిన క్షణాల్లోనే శవమై కనిపించాడు. ఈ సంఘటన బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెంలో విషాదం నింపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చిత్రం రవి, పార్వతి దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. రెండో కుమారుడు జీవన్ స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్లకుండా తల్లిదండ్రులతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం వారితో కలిసే ఇంటికి చేరాడు. ఇప్పుడే వస్తాను అంటూ సైకిల్ తొక్కుకుంటూ రోడ్డుపై వెళ్తుండగా.. కొద్దిదూరంలోనే ఎదురుగా వస్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి జీవన్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పటిదాకా తమతో కలిసిమెలిసి ఆనందంగా ఉన్న కొడుకు కళ్లముందే చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ట్రాక్టర్‌ను గ్రామానికి చెందిన మెస్రం సురేందర్‌దిగా గుర్తించారు. బాలుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గజేంద్ర తెలిపారు.



జీవన్ (ఫైల్)

విద్యతోనే మహిళా సాధికారత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

జగిత్యాల: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని జిల్లా సాధికారత కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. గురువారం పట్టణంలోని ఉస్మాన్‌పురలో ఉన్న మహిళలకు భేటి బచావో, భేటి పడావో పథకంపై అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళలు అన్ని హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతి మహిళ సఖీ 181, 1098 చైల్డ్‌హెల్ప్‌లైన్, టోల్‌ఫ్రీ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా ఇంట్లో తల్లిదండ్రులను బాగా చూసుకోకపోయినా 14567 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూపరాణి, సుల్తానా, రిజ్వానాబేగం, గౌతమి, హిమశ్రీ పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్ కేసులో మూడేళ్ల జైలు

సిరిసిల్లక్రైం: జాతరకు వెళ్లి వస్తున్న మహిళ మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన వ్యక్తికి మూడేళ్ల జైలుతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన వీరవేణి లత 2015 జనవరిలో తన తోడికోడలుతో కలిసి ఓ జాతరకు తిరిగి ఇంటికొస్తుంది. ఈక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ ఆఫీస్ ముందు ఒకరు లత మెడలోంచి పుస్తెల తాడును లాక్కెళ్లాడు. దీంతో బాధితురాలు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మరుసటి రోజు పెట్రోలింగ్ చేస్తుండగా సిరిసిల్ల పెద్దబజారు వద్ద అల్లెపు కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు నిందితుడు ఒప్పుడుకోగా రిమాండ్ తరలించారు. పోలీసులు కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టగా పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి మూడేళ్ల జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

దాడికేసులో మూడేళ్ల జైలు

సిరిసిల్లక్రైం: అప్పుగా ఇచ్చిన సొమ్మును తిరిగివ్వాలని అడిగిన వ్యక్తిపై దాడి చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలుతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు. కోనరావుపేటకు చెందిన రాస నారాయణరెడ్డి 2016 జూన్‌లో అదే గ్రామానికి చెందిన చల్ల రాజిరెడ్డికి రూ.5వేలు అప్పుగా ఇచ్చాడు. వీటిని చెల్లించాలని అప్పు తీసుకున్న వ్యక్తి పలుమార్లు అడిగినా రేపు, మాపంటూ జాప్యం చేశాడు. దీంతో నారాయణరెడ్డి ఆగస్టు 2016లో చల్ల రాజిరెడ్డి వద్దకు వెళ్లి అడగ్గా నెట్టివేశాడు. నారాయణరెడ్డి మోచేతికి, కుడితుంటికి గాయమైంది. దీంతో నారాయణరెడ్డి కొడుకు రాజు ఫిర్యాదు చేయగా కోనరావుపేట పోలీసులు రాజిరెడ్డిపై కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి రాజిరెడ్డికి మూడేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సబ్‌స్టేషన్‌లో కండక్టర్ వైరు చోరీ


కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చోరీ జరిగింది. కండక్టర్ వైరును దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ ఏఈ నరేశ్ ఈ నెల 10న కరీంనగర్ స్టోర్ నుంచి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం 600 మీటర్ల కండక్టర్ వైరును తీసుకువచ్చి, సబ్‌స్టేషన్ ఆవరణలో నిల్వ చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు వెళ్లి చూడగా కనిపించలేదు. సిబ్బందిని అడిగితే తెలియదని చెప్పారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు కండక్టర్ వైరు దొంగిలించారని, దాని విలువ రూ.22,800 అని ఏఈ తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఇరుకుల్ల, చెర్లభూత్కూర్ గ్రామాల్లోని మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి ఆయిల్, కాపర్‌వైరు తదితర సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఇప్పుడు ఏకంగా సబ్‌స్టేషన్‌లో ఉన్న వైరును దొంగిలించడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి, దొంగలను పట్టుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు కోరుతున్నారు.



చోరీకి గురైన కండక్టర్ వైరు (ఫైల్)

మార్కెట్లోకి హ్యుందాయ్ న్యూక్రెటా కారు

కరీంనగర్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 2024 హ్యుందాయ్ న్యూ క్రెటా కారును గురువారం కరీంనగర్‌లోని సస్య హ్యుందాయ్ షోరూంలో ఎండీ ఆర్.హరీశ్ రెడ్డి, ఏసీపీ జి.నరేందర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. కొత్త క్రెటా కారును మార్కెట్లోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందుపరిచి, అనేక మంది కస్టమర్ల ప్రశంసలు పొందిందని తెలిపారు. డైనమిక్ ఎస్‌యూవీ క్వాడ్ బీమ్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, హ్యుందాయ్ స్మార్ట్ సెన్స్ లెవల్–2 ఏడీఏఎస్ వంటి ఫీచర్లతో సెన్సుయస్ స్పోర్టినెస్ డిజైన్ లాంగ్వేజ్‌ను కలిగి ఉందన్నారు. కొత్త 1.5 ఎల్ టర్బో జీడీఐ పెట్రోల్ ఇంజిన్‌తో సహా శక్తివంతమైన పవర్ ట్రైన్ల ఎంపికను అందిస్తుందని, దీని ధర రూ.10.99–రూ.19.99 లక్షల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో హ్యుందాయ్ ఎస్‌యూవీ లైనప్ కోసం కొత్త శకం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు సత్యనారాయణ, శ్రీనివాస్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.



కారును ప్రారంభిస్తున్న ఎండీ హరీశ్‌రెడ్డి, ఏసీపీ

నాయకులను విడుదల చేయాలి

కరీంనగర్: జగిత్యాల ఐలమ్మ కాలనీలో పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చిన పోలీసులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణతోపాటు స్థానిక నాయకులు 9 మందిని అరెస్టు చేసి, కరీంనగర్ జైలుకు తరలించారు. మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నరసింహ, బాలకృష్ణ భార్య భవాని, కరీంనగర్ ప్రజాసంఘాల నాయకులు ముకుందరెడ్డి, వర్ణ వెంకట్ రెడ్డి, పప్పు సదానందం గురువారం జైలుకు వెళ్లి, బాలకృష్ణను పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓవైపు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెబుతూ మరోవైపు ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే కూల్చేస్తోందని అన్నారు. బాలకృష్ణపై 14 కేసులు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. సర్కారుకు పేదలకు ఇంటి స్థలం ఇవ్వడానికి మనసు రావడం లేదని విమర్శించారు. సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు హరీశ్‌కుమార్ పాల్గొన్నారు.



బాలకృష్ణను కలిసి వస్తున్న ఆయన భార్య భవాని

ఆర్వోబీకి ఎంపీ నయాపైసా తేలే..

- కరీంనగర్‌పై గులాబీ జెండా ఎగురవేయాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

మల్యాల(చొప్పదండి): కేసీఆర్ చావు నోట్లో తల పెట్టి, తెలంగాణ సాధించారని, తర్వాత ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని పేర్కొన్నారు. మల్యాల మండలంలోని రాంపూర్ శివారులో గురువారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. 2014లో కరీంనగర్ ఎంపీగా గెలిచిన తర్వాత కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా, కరీంనగర్ నుంచి మనోహరాబాద్ వరకు రైల్వే ప్రాజెక్టు తీసుకువచ్చామని తెలిపారు. విభజన హామీలపై పార్లమెంట్‌లో ప్రశ్నించానని గుర్తు చేశారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్న కాలంలో రైల్వే ప్రాజెక్టు కోసం నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. కరీంనగర్ ఆర్వోబీకి ఎంపీ సంజయ్ నయాపైసా తేలేదని, తెచ్చినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసమే అప్పులు చేశామని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్‌పై గులాబీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కొండపల్కల రామ్మోహన్‌రావు, సర్పంచ్‌ల మండల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, ప్యాక్స్ చైర్మన్లు అయిల్నేని సాగర్‌రావు, బోయినపల్లి మధుసూదన్‌రావు, ముత్యాల రాంలింగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్